

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్

## ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఏప్రిల్ 2: ప్రజలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం వెంకటాపురం డివిజన్ సుభాష్ నగర్ లో చలివేంద్రాన్ని ఎమ్మెల్యే, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛందంగా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది, అయితే ప్రజల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లనే బీఆర్ఎస్ పార్టీ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్, అనిల్ కిషోర్, రమేష్, మోసిన్, శ్రీనివాస్, సంపత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్ నివాసం ముట్టడి కోసం వెళ్తున్న గిరిజన సంఘాల నేతలు

## లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకుంటే కాంగ్రెస్ పార్టీని ఓడిస్తాం

బంజారాహిల్స్, ఏప్రిల్ 2: జనాభాలో 10 శాతం ఉన్న లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోతే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్ బంజారా హెచ్చరించారు. మంత్రివర్గ విస్తరణలో భాగంగా లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గిరిజన విద్యార్థి సంఘం,లంబాడీ హక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో బుధవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసం ముట్టడికి యత్నించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం 36నుంచి సీఎం నివాసం వైపుకు ప్లకార్డులతో వెళ్తున్న గిరిజన సంఘం నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు సంఘాల నేతలను అరెస్ట్ చేశారు. లోకేష్ నాయక్, సైదానాయక్, వివిధ గిరిజన సంఘాల నాయకులు రమేష్ నాయక్, రోహిత్ పవార్, అరుణ్ శ్రీరాం, పరుశరామ్‌నాయక్, పున్ని బాయ్, అచ్చి బాయ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేసిన రిటైర్డ్ ఐఏఎస్ సుబ్రహ్మణ్యం, తదితరులు

## ఘనంగా ' ద రివ్యూ(ఇన్)సైట్' పుస్తకావిష్కరణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : ప్రముఖ రచయిత వెంకట్ చంగవల్లి రచించిన ' ద రివ్యూ(ఇన్)సైట్' పుస్తకావిష్కరణ కార్యక్రమం నగరంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ సుబ్రహ్మణ్యం, టెక్ మహేంద్ర మాజీ సీఈఓ ఏ.ఎస్ మూర్తి పాల్గొన్నారు. కాగా సమీక్షకుడి ప్రాధాన్యత, నైపుణ్యం,నాయకత్వ విధానాలపై ఈ పుస్తకం సాగుతుందని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమీక్ష ప్రక్రియ అనేది అంచనా వేయడం కాదని పరివర్తన, జవాబుదారితనానికి ఉత్ప్రేరకంలాంటిదని కొనియాడారు.


సరూర్నగర్ మండల కార్యాల వద్ద ధర్నా చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

## ట్రైకార్ బకాయి రుణాలు వెంటనే విడుదల చేయాలి

### గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్

ఆర్కే పురం, ఏప్రిల్ 2 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ట్రైకార్ బకాయి రుణాలు రూ.219 కోట్లను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివ నాయక్ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు మూడావత్ గోపి నాయక్ ల అధ్యక్షతన సరూర్ నగర్ మండల కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులకు సంబంధించిన ట్రైకార్ 2019-2020 -2021 లో 30 వేల మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం గుర్తించి రూ.219 కోట్లల నిధులు కేటాయించి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖ వద్ద పెండింగ్ లో ఉన్న ఈ నిధులు నేటికీ విడుదల చేయకుండా ప్రభుత్వం గిరిజనులకు ఇబ్బంది చేస్తున్నారని వెంటనే గిరిజనుల కేటాయించిన 219 కోట్ల రూపాయల బకాయి రుణాలను విడుదల చేసి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ 30 వేల మంది లబ్ధిదారులు ఇతర ఏ రుణాలకు దరఖాస్తు చేసినా ఆన్ లైన్ లో రిజెక్ట్ అవుతున్నాయని ప్రభుత్వం సత్వరమే 219 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసి ఈ 30 వేల మంది లబ్ధిదారులకు మేలు చేకూర్చి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, శంకర్ నాయక్, మేడ సుశీల, బానోత్ భిక్షునాయక్ , మూడావత్ లోక్య నాయక్,కె. కృష్ణ నాయక్, సభావట్ రవి నాయక్,పి. శివ నాయక్, వడిత్య సరిలాల్ నాయక్, రమావత్ చత్రునాయక్, జాటోత్ రెడ్యా నాయక్, ఉపేంద్ర ,రాధిక, జె.బీరయ్య, జె. వీరన్న, వనం నాగయ్య, జె. శీను, జె. అర్జున్, వనం అంజి పాల్గొన్నారు.

# అవగాహనతోనే ఆటిజానికి చెక్

## జిల్లాలో పెరుగుతున్న బాధితులు

### వైద్యులను సంప్రదించకుండా నిర్లక్ష్యం

### అర్హత లేకున్నా తెరపీలు చేస్తున్న ప్రైవేట్ సెంటర్లు

### నేడు 'ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం'

సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ఇంట్లో పిల్లలుంటే ఇంటికే అందం. అల్లరితో సందడి చేస్తూ, చిరునవ్వులను చిందిస్తూ ఆడిపాడుతుంటారు. వారి అల్లరి పనులతో ఇంటిల్లిపాది కష్టసుఖాలను కూడా మర్చిపోతారు. కానీ ఆడిపాడాల్సిన వయస్సులో ఎవరితో మాట్లాడకుండా, తమలో తామే ఏకాంతంగా గడపడం, జనాల మధ్యలో ఉంటే చిరాకు పడటం, నేరుగా ఎదుటివారి కళ్లలోకి చూసి మాట్లాడకపోవడం, గాయాలు తగిలినా తెలుసుకోకపోవడం, కారణాలు లేకుండా ఏడవటం వంటి సమస్యలతో బాధపడుతూ ఆటిజానికి గురవుతున్నారు. సకాలంలో గుర్తించకుండా తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయడంతో, ఆటిజం పేరుతో ప్రైవేట్ తెరపీ సెంటర్లు వేలల్లో వసూలు చేస్తూ అమాయకులను మోసం చేస్తున్నారు. అవగాహన కల్పించేందుకు ప్రతి యేటా ఏప్రిల్ 2న 'ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం 'గా జరుపుతున్నారు.

### తిరిగి తెరపీకి రావడం లేదు..

మానసిక ఎదుగుదల లోపంతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గతంలో వంద మందిలో ఒక్కరు మాత్రమే లక్షణాలతో బాధపడేవారు. ప్రస్తుతం 40 మందిలో ఒక్కరు ఇబ్బందిపడుతున్నారు. ప్రతిరోజు నిలోఫర్ ఆసుపత్రిలో ఉన్న డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డీఈఐసీ)కు తమ పిల్లలను తల్లిదండ్రులు తీసుకోస్తున్నారు. ప్రతినెల సుమారుగా 150 మంది చిన్నారులు థెరఫీకోసం వస్తున్నారు. వీరిలో అధికంగా మూడేండ్ల నుంచి ఆరేండ్ల వయస్సు వారే అధికం. నయం కావాలంటే తెరపీ మాత్రమే సరైన మార్గం. బాధితులకు ఆక్యుపేషనల్, స్పీచ్, బిహేవియర్ థెరఫీలను స్థాయిని బట్టి ఇస్తుంటారు. థెరఫీలు సకాలంలో చేయించకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల నెలలు గడిచినా చిన్నారుల్లో మార్పు కనిపించడం లేదు. నిలోఫర్‌లోని సెంటర్‌కు పలు ప్రాంతాల నుంచి వచ్చే వారు క్రమంగా రావడం లేదని తెలిసింది. అంతేకాకుండా థెరఫీ పూర్తికాకుండానే వెళ్లిపోవడం, తిరిగి ఏడాది తరువాత వచ్చి చూపించుకోవడం వల్ల తిరిగి మొదటినుంచి ప్రారంభించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు ఉపాధ్యాయ సిబ్బంది

### బోయిన్ పల్లిలో..

బొల్లారం, ఏప్రిల్ 2: జాతీయ మేధో దివ్యాంగుల సాధికారిత సంస్థ బోయిన్ పల్లిలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆటిజంపై జాతీయ మేధో దివ్యాంగుల సాధికారత సంస్థ కేంద్రం నుండి బోయిన్పల్లి మార్కెట్ యార్డ్ అంబేద్కర్ విగ్రహం వరకు సుమారు 500 మంది సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. డైరెక్టర్ బివి. రామ్ కుమార్ మాట్లాడుతూ.. న్యూరోడైవర్సిటీని ముందుకు తీసుకువెళ్లడం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే విషయంపై దివ్యాంగుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని తెలిపారు. ఎన్ఈఐపీఐడీ సంస్థ ప్రిన్సిపాల్ గణేష్ షేరిగర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### తెరపీ ముసుగులో ప్రైవేట్ దందా..

నగరంలో ఆటిజం తెరపీ దందా పేట్రేగిపోతోంది. కేవలం ఒక్కసారి ఒక్క తెరపీ చేసినందుకే రూ.8వేల వరకు తీసుకుంటున్నారు. అంతేగాకుండా అర్హతలేని సిబ్బందిని పెట్టి వారికి శిక్షణిస్తూ ఆటిజం బాధితులపై ప్రయోగం చేస్తున్నారు. గాలి, వెలుతురు లేని ఇరుకు గదుల్లో థెరఫీ కేంద్రాలను నిర్వహిస్తూ అమాయకుల నుంచి సొమ్మును కాజేస్తున్నారు. సుమారు హైదరాబాద్ నగరంలో 100కు పైగా కేంద్రాలు ఉండగా, వాటిల్లో ఉండే సిబ్బంది అంతా అనర్హులే కావడం గమనార్హం.

### అపోహలొద్దు..



**- డాక్టర్ ఎం.హృషికేష్ గిరిప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్, చిన్నపిల్లల సైకియాట్రి, నిలోఫర్ ఆసుపత్రి**

ఆటిజం పట్ల తల్లిదండ్రులు అపోహలు వీడాలి. పిల్లలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. అనుమానం ఉంటే వైద్యులను సంప్రదించాల్సిందే. నయమయ్యేంత వరకూ థెరపీ మాత్రం తప్పనిసరి చేయించాలి. ఇతర పిల్లలతో స్నేయం చేయనివ్వండి.

### ఆటిజం పట్ల అవగాహన కల్పించాలి

**- డాక్టర్ రవికుమార్, నీలోఫర్ సూపరింటెండెంట్**

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 2 పిల్లలో ఆటిజం లక్షణాలను ప్రాథమిక దశలో గుర్తించి వారి కుటుంబాలకు అవగాహన కలిపించడంతో పాటు వీలైనంత త్వరగా చికిత్స ప్రారంభిస్తే ఆ సమస్య నుంచి కొంత వరకు బయటపడేందుకు అవకాశం ఉంటుందని నీలోఫర్ దవఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. రవికుమార్ అన్నారు. నీలోఫర్ దవఖానలో ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా ఆటిజంపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ ఆటిజం మూడు సంవత్సరాల వయస్సులో కనిపిస్తుందని అన్నారు. మెదడు పనితీరులో తేడాలు ఉంటాయని వారి ప్రవర్తన సామాజిక చర్యలను ప్రభావితం చేయడం ద్వారా ఆటిజంను గుర్తించవచ్చని అన్నారు.


అవగాహన సదస్సులో పాల్గొన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది



### వారిని అర్థం చేసుకోండి..

**- రెబిక, చైల్డ్ సైకాలజిస్టు, డీఈఐసీ సెంటర్**

తల్లిదండ్రులుగా పిల్లలను నిరంతరం ప్రోత్సహించాలి. చిన్నారుల ఆలోచనలు పంచుకోవాలి. ఆటిజం వల్ల బాధపడాల్సిన అవసరం లేదు. సకాలంలో థెరపీ అందించడంతో ఆ సమస్యకు చెక్ పెట్టినవాళ్లమవుతాం. ఆటిజంపై అవగాహన కలిగిఉండాలి

### గమనిస్తుండండి..

తమ పిల్లలు ఇంట్లో ఏ విధంగా నడుచుకుంటున్నారన్న సంగతి తల్లిదండ్రులు గమనిస్తుండాలి. నిత్యం ఫోన్, టీవీల్లో మునిగిపోకుండా మైదానాలకు పంపించి క్రీడా స్ఫూర్తిని పెంచాలి. వారి నుంచి ఏకాంతాన్ని దూరం చేసేందుకు తప్పనిసరిగా వారితో మాట్లాడుతుండాలి. సమస్యలను గుర్తించి ధైర్యం చెప్పాలి. ఆటిజం లక్షణాలు గమనిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. చిన్నారులను డే కేర్ సెంటర్ల నుంచి దూరం చేసి తల్లి ప్రేమకు దగ్గరచేయాలి.

# హెచ్‌సీయూ విద్యార్థులకు సంఘీభావం

*హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటానికి అన్ని వైపుల నుంచి మద్దతు వస్తున్నది. మేధావులు, విద్యావంతులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, వామపక్షాల యూనియన్లు అందరూ... జీవ వైవిధ్యాన్ని కాపాడాలని గళ మెత్తారు 400 ఎకరాల వర్సిటీ భూముల వేలం నిలిపివేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని తీవ్రంగా ఖండించారు.*



## లాఠీ ఛార్జ్ దారుణం

ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పోలీసులు లాఠీచార్జ్ చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే, ఓయూ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు పి శశిధర్ రెడ్డి అన్నారు. విద్యార్థులకు మద్దతుగా ఆ విశ్వవిద్యాలయానికి సంబంధించిన ప్రొఫెసర్లు ర్యాలీ నిర్వహిస్తుంటే వారిపై ప్రభుత్వం పోలీసులచే అమానుషంగా లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద గొడ్డలి పెట్టులాంటిదని అన్నారు. **– మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి**

## ఇందిరమ్మ రాజ్యమంటే నిర్బంధాలేనా?

### మేడే రాజీవ్‌సాగర్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ప్రశ్నించే వారిని అణచివేయడం.. గొంతెత్తినవారిని నిర్బంధించడమే ఇందిరమ్మ పాలనా? అని తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ స్వర్ణోత్సవాల వేళ విద్యార్థులకు మేలు చేయాల్సిన సర్కారు భూముల అమ్మకానికి పూనుకోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. పర్యావరణానికి హాని కలిగించే చర్యలను విరమించుకోవాలని హితవు పలికారు. నాడు హెచ్‌సీయూకి వచ్చి అండగా ఉంటానని చెప్పిన రాల్‌గాంధీకి విద్యార్థుల ఆర్తనాదాలు వినిపించకపోవడం బాధాకరమని తెలిపారు.


షాపూర్ నగర్ లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

## తెలంగాణలో ప్రభుత్వ భూములకు రక్షణ లేదు

దుండిగల్, ఏప్రిల్ 2: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైపోయిందని, ఎవరు పడితే వారు విచ్చలవిడిగా భూములను ఆక్రమించుకుంటున్నారని చివరికి విద్యాసంస్థల భూములను కూడా వదలడం లేదని కుత్బుల్లాపూర్ మండలం సీపీఎం పార్టీ కార్యదర్శి కే లక్ష్మణ్ అన్నారు. హెచ్‌సీయూ భూముల ఆక్రమణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న విద్యార్థులను, సిపిఎం పార్టీ నేతల అక్రమ అరెస్టులకు నిరసనగా బుధవారం షాపూర్ నగర్ లోని రైతు బజార్ నుంచి సాగర్ హోటల్ చౌరస్తా వరకు సీపీఎం కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొద్దిసేపు రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు.

## హెచ్‌సీయూ భూములు విక్రయించడం ఆపాలి

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 2: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మడాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ పిలుపుమేరకు హెచ్‌సీయూ విద్యార్థుల పోరాటానికి మద్దతుగా జేఎన్టీయూహెచ్‌లో తరగతులను బహిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, కార్యవర్గ సభ్యులు మలిశెట్టి రిషి, యూనివర్సిటీ అధ్యక్షుడు శ్రీరామ్, లేకాజ్, అజయ్, అరవింద్, శివ ఉన్నారు.

## విద్యార్థులపై దాడులు చేయడం దుర్మార్గం

**- ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్**

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 2: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని నిరసిస్తూ పోరాడుతున్న విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం బాధాకరమని కూకట్‌పల్లి జనసేన ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్‌సీయూ భూములను అమ్మితేనే ఖజానా నిండుతుంది అని... పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.భూముల కోసం పోరాడుతున్న విద్యార్థులను విచక్షణ రహితంగా కొట్టడం దుర్మార్గమన్నారు.

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పోరాడుతాం

**- కిశోర్ గౌడ్**

బోడుప్పల్, ఏప్రిల్ 2:హెచ్‌సీయూ భూ సేకరణపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధమని ఓయూ టీఎస్ జాక్ స్టేట్ కో కన్వీనర్ వర్కల కిషోర్ గౌడ్ హెచ్చరించారు. బుధవారం బోడుప్పల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తుందని, పర్యావరణాన్ని, జీవవైవిద్యాన్ని దెబ్బతీసేలా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కునే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు. యూనివర్సిటీ భూముల ఆక్రమణలపై ప్రభుత్వం వెంటనే వెనక్కి తగ్గాలని ఆయన డిమాండ్ చేశారు.

# నగరంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

### ప్రభుత్వ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): విద్యుత్ సంస్థల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే లైన్‌మెన్, ఆర్టిజెన్ల పాత్ర ఎంతో కీలకమని, అన్ని కేటగిరీల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం పైస్థాయిలో ప్రభుత్వం, యాజమాన్యాలు ఏ నిర్ణయాలు తీసుకున్నా వాటిని అమలు చేయడం క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందిపైనే ఆధారపడి ఉంటుందని ప్రభుత్వ ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. బుధవారం జీటీఎస్ కాలనీలో జెన్‌కో ఆడిటోరియంలో బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని మొత్తం సిబ్బందితో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఒక సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కార్మికులనుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. వేసవికాలంలో పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టు గ్రేటర్ హైదరాబాద్ నగరంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి పలు రకాల చర్యలు చేపట్టామని సందీప్ కుమార్ సుల్తానియా చెప్పారు. ఇందులో భాగంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో సుల్తానియా మాట్లాడుతూ ఈ సీజన్‌లో విద్యుత్ డిమాండ్ 17162 మెగా వాట్లకు చేరిందని, డిమాండ్ ఇంతగా పెరిగినా ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడం వెనక క్షేత్రస్థాయి సిబ్బంది కృషి కారణమన్నారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ మాట్లాడుతూ వేసవి కాల సన్నద్ధతకు సంబంధించి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సంస్థ పరంగా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు డా.నర్సింహులు, సాయిబాబా, నందకుమార్, సుధామాధురి, చీఫ్ ఇంజనీర్ చక్రపాణి, ఎస్ఈలు, డిఈలు, బంజారాహిల్స్ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సందీప్‌కుమార్ సుల్తానియా


ఎన్నికల్లో విజయం సాధించిన వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్

## వీఎస్ టీయూ అధ్యక్షుడు సంజీవరెడ్డి ప్యానల్ ఘనవిజయం

చిక్కడపల్లి, ఏప్రిల్ 2: వీఎస్ టీఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ కన్స్యూమర్ సొసైటీ ఎన్నికల్లో వీ ఎస్ టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, జి సంజీవరెడ్డి ప్యానల్ ఘన విజయం సాధించింది. బుధవారం బాగ్ లింగంపల్లిలోని వీఎస్ టీ యూనియన్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికలు జరిగాయి. ఈ సొసైటీలో 186 మంది ఓటర్లు ఉండగా పోలింగ్లో 173 మంది పాల్గొన్నట్లు ఎన్నికల అధికారి శివకుమార్ తెలిపారు. ఎన్నికల్లో పదిమంది డైరెక్టర్ల కోసం 24 మంది పోటీ చేసినట్లు తెలిపారు. ఇందులో 9 మంది జనరల్ కోట డైరెక్టర్ ల కోసం 21 మంది ఒక ఎస్సీ డైరెక్టర్ కోసం, ముగ్గురు పోటీ చేసినట్లు చెప్పారు. ఈ పోటీలో జీఎస్టీ అధ్యక్షులు జి సంజీవరెడ్డి ప్యానల్, మాజీ మంత్రి దివంగత నాయిని నరసింహారెడ్డి ప్యానల్, బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ప్యానెల్ లో పోటీపడ్డాయి. అయితే ఈ పోటీల్లో జి సంజీవరెడ్డి సభ్యులు ఏకపక్షంగా పదిమంది గెలిచారు. ఎస్సీ కోటా నుంచి గౌరీ శంకర్, జనరల్ కోట నుంచి అభిషేక్, అజయ్ కుమార్, నవీన్ కుమార్, పాల్ సింగ్, రాజశేఖర్ రెడ్డి, రాహుల్, సత్యనారాయణ, శ్యాముకుట్టి, మహ్మద్ హబీబ్ షరీఫ్ లు గెలిచినట్లు ఎన్నికల అధికారి శివకుమార్ ప్రకటించారు.